## 3-25

## మున్నుడి

అన్నమాచార్యులవారు కలశాపురం (నేటి అనంతపురం జిల్లాలో వున్నది) దర్శించి అక్కడ వెలసిన 'హనుమంతుని' పై ఈ కీర్తన చెప్పారు. హనుమంత రాయుడని అభివర్ణిస్తూ ఆయన ప్రతాపాన్నీ శ్రీరామునికి ఆయన చేసిన సేవను గుర్తుచేస్తున్నారు. 'నీరు' అంటే అల్పమైనది (అల్పము) అని అర్థమున్నది. లంకను నిమిషాన నీరు సేసి–అంటే స్వర్ణలంకను క్షణంలో అల్పమైన బూడిద చేసి అని అర్థం. 'సహజాన నొక జంగచాచి' అంటె, స్వభావ సిద్ధంగా తన ఒక పిక్కనుచూచి యుంచి అని అర్థం. కొత్తచోటికి ఎగిరి దూకాలంటే అదే చేయాలి కదా! అన్నమయ్యకు రాముడే వేంకన్న.

**కం॥ కలశాపురమందున తా**
**నలరుచు నున్నాడు వాడె హనుమంతుడు ఆ**
**నళినీకాంతుని కొలుచుచు**
**అలయని బంటనెను అన్నమయ్యను వినుడీ.**

**రాగం : వసంత**

కలశాపురము కాడ కందువ సేసుకొని
అలరుచున్నవాడు హనుమంత రాయుడు ॥కలశా॥

సహజాన నొకజంగ చాచి సముద్రము దాటి
మహిమ మీరగ హనుమంత రాయుడు
ఇహమున రాముబంటై యిప్పుడు నున్నవాడు
అహరహమును దొడ్డ హనుమంతరాయుడు ॥కలశా॥

నిండు నిధానపు లంక నిమిషాన నీరు సేసె
మండిత మూరితి హనుమంత రాయుడు
దండితో మగి(గు)డి వచ్చి తగ సీత శిరోమణి
అండ రఘుపతికిచ్చె హనుమంత రాయుడు ॥కలశా॥

వదలని ప్రతాపాన వాయుదేవు సుతుడై
మదియించినాడు హనుమంతరాయుడు
చెదరక యేప్రొద్దు శ్రీవేంకటేశు వాకిట
అదివోకాచుకున్నాడు హనుమంతరాయుడు ॥కలశా॥

**భావామృతం :**

కలశాపురమునందు కందువ (జాడ) సేసుకొని (తెలియజేయుచు) విలసిల్లుచున్న ఈ మహానుభావుడే హనుమంతరాయుడు. (ఈయనను సేవించండి).

ఆకాశమున కెగిరి దూకి లంకజేరుటకు నంకల్పించిన వాడై, ఆ హనుమంతరాయుడు స్వభావ సిద్ధముగా ఒక పిక్కను చాచియుంచి మహిమను జూపుతూ సముద్రమును దాటినాడు. నేటి కలియుగమున కూడ అహరహము (రాత్రింబవళ్ళు) రామబంటువలె ఈ పెద్ద హనుమంతుడు నెలకొని యున్నాడు.

నిండు నిధానము (పూర్తిగా స్వర్ణమయం) అయిన లంకను నిముషంలో నీరు (అల్పమైనది) గా చేసి పారవేశాడు. ఈ మండితమూర్తి (అలంకరింపబడిన స్వామి). శౌర్యముతో మగుడివచ్చి (తిరిగివచ్చి) సీతాదేవి శిరోమణిని నాథుడైన శ్రీరామునికిచ్చి ఆ రఘుపతిని ఆనందపరచినవాడు ఈ హనుమంతరాయుడు. (ఈయనకు చేతకాని దేదీ వుండదు)?వాయునందనుడైన ఈ పరాక్రమశాలి ఎన్నడూ వీడని ప్రతాపము గలవాడు. అందుచే ఈ హనుమంతరాయుడు మదియించి వున్నాడు. (మదించి యున్నాడని అర్ధం చేసికొనరాదు. ఇక్కడ మదియించి అంటే మనసులో ధ్యానము చేయుచూ వున్నాడని అర్ధం) వున్నాడు. ఏ వేళలోనైనా ఈయన చెదరక (పరాకులేక) శ్రీవేంకటేశ్వరుని వాకిటిలో (అనంతపురం తిరుమల యెదుటనే వున్నదని భావన) అదిగో కాచుకొని సిద్ధముగా నున్నాడు. ఈ హనుమంత రాయుడు. (ఈ స్వామిని సేవించి తరించండి.